అట్టహాసంగా..

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులు జరిగిన 21వ యానాం ప్రజా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. చివరిరోజు బుధవారం రాత్రి వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రత్యేక నృత్యాలు, ఫ్యాషన్ షోలతో అదరగొట్టారు.. ఆ దృశ్యాల్లో కొన్ని..

6



కాకినాడలో జరిగిన యూటీఎఫ్ మహాసభల్లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ నాయకత్వం

ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

కాకినాడలో నాలుగు రోజులపాటు జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారం ముగిసాయి. చివరిరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను త్వరలో చెల్లించనుందని వెల్లడించారు. కాగా యూటీఎఫ్ నూతన రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా సురేష్‌కుమార్, ప్రచురణాల కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు ఎన్నికయ్యారు. -7లో





'తెలుగు' వెలుగు

జీజీయూలో ఘనంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు



రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరంలో ఉన్న గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రారంభమైన రెండవ ప్రపంచ తెలుగు మహాసభల్లో నృత్య ప్రదర్శన

- తరలివచ్చిన ప్రముఖులు
- తెలుగులోనే పాలన సాగాలి : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వైభవంగా సాగిన తొలిరోజు పండుగ





తెలుగు మహాసభలను ప్రారంభిస్తూ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన గరికిపాటి, యార్లగడ్డ, చైతన్యరాజు, చామర్తిరాజు తదితరులు.. (కింద) వెంకయ్య ఉపన్యాసం

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే సంకల్పంతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జీజీయూ ప్రాంగణంలో ఆదికవి నన్నయ భట్టారక, రాజరాజ నరేంద్ర, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు పేరిట మూడు ప్రధాన వేదికలను ముస్తాబు చేసి తెలుగు భాషా సాహితీ ప్రక్రియలను నిర్వహించారు. ప్రధాన వేదిక చెంతనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన అయోధ్య బాలరాముడి ఆలయ నమూనా అందరినీ అబ్బురపరుస్తోంది. ఉదయం గణపతి ఆరాధన అనంతరం జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అంతా తెలుగులోనే సాగాలి. ఇక తెలుగు మాట్లాడేవాడికే ఓటేయాలి. తెలుగు భాష రానివాళ్లను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్‌వాళ్లు రాజమహేంద్రవరం వంటి పేర్లు పలకలేక రాజమండ్రిగా మార్చారు. ఇక రాజమహేంద్రవరం అనే పిలవాలి. ఇలా చాలాపేర్లు, పదాలు మార్చేసి, మనభాషను, సంస్కృతిని చెడగొట్టారు. వాటిని మనం సరిదిద్దుకోవాలన్నారు. ఆదికవి నన్నయ్య, ఆధునిక వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వంటి వారెందరో తెలుగుభాషను సుసంపన్నం చేశారని గుర్తుచేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మహాసహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు, బృహత్ ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఆధ్యాత్మికవేత్త, శ్రీభారతీ తీర్థ పురస్కార గ్రహీత పి.బంగారయ్యశర్మ, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ప్రొఫెసర్ చామర్తి రాజు, కేటీ రామరాజు, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా సోలోమన్ డార్విన్, మాజీ ఎమ్మెల్సీ గోనె ప్రకాశరావు, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, ధూళిపాళ మహాదేవమణి, ప్రముఖ హాస్యనటుడు భద్రం, స్టార్టప్ కంపెనీ స్థాపించి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న మృత్యుంజయేశ్వర్, గోమూత్రంతో కేన్సర్, డయాబెటిస్ వంటి వాటికి మందులు తయారు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన కన్నయ్య కదంజి, న్యూక్లియర్ శాస్త్రవేత్త ఆర్.శ్యామసుందర్, సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ, వేదుల శిరీష, మధుప్రోమా, జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, జీజీయూ ప్రోఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, మాజీ ఎమ్మెల్సీ రవివర్మ తదితరులు విచ్చేశారు. ప్రముఖులు పీవీబీ సంజీవరాజు, సత్యనారాయణరాజు, కృష్ణంరాజు, సుబ్బరాజు, వీఎస్ఆర్ సోమయాజులు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



తెలుగుభాష కోసం ఉద్యమించాలి : గరికిపాటి

ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమమే ఉండాలి. డిగ్రీ వరకు తెలుగు పాఠ్యాంశం ఉండాలి. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని మహాసహస్రావధాని, పద్మశ్రీ గరికిపాటి నరసింహరావు అన్నారు. తెలుగు మహాసభల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఫోన్ చేసి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని కోరిన సందర్భంలో ఈ డిమాండ్లు చెప్పానన్నారు. ఇవి జరగనప్పుడు భాషా సంఘం ఉన్నా ప్రయోజనం లేదన్నారు.



వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న ప్రముఖులు

నన్నయతోనే తెలుగు సాహిత్య విప్లవం : యార్లగడ్డ



పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ చైతన్యరాజు నాంది పలికిన ఈ కార్యక్రమం చారిత్మాత్మకం అవుతుందన్నారు. నన్నయ మహాభారతాన్ని ఆంధ్రీకరించడంతో ఈ ప్రాంతంలో తెలుగులో సాహిత్య విప్లవం మొదలైందన్నారు. హిందీ అష్టావధానం చేసిన ఈ నగరానికి చెందిన చేబోలు శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని గతంలో తయారు చేయించానని, దానిని ప్రతిష్ఠింపజేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చైతన్యరాజుకు విజ్ఞప్తిచేశారు.

తెలుగుపై ప్రేమతోనే నిర్వహణ : చైతన్యరాజు



తెలుగుభాష పట్ల అపారమైన ప్రేమ ఉన్నందునే ప్రపంచ మహాసభలను ఇక్కడ నిర్వహిస్తున్నామని జీజీయూ కులపతి చైతన్యరాజు అన్నారు. గతేడాది జనవరిలో మూడు రోజులపాటు మహాసభలు జరిపించి, ఐదు రోజులపాటు శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జోడించిన విషయాన్ని గుర్తుచేశారు. కృత్రిమ మేథ, సాంకేతికతతో అయోధ్య రాముని నమూనా ఆలయం ఏర్పాటు చేశామన్నారు.

డిజిటల్ విధానంలోనే పన్నుల వసూళ్లు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు డిజిటల్ విధానంలోనే పన్నులు, పన్నుయేతర వసూళ్ల చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈమేరకు బుధవారం పంచాయతీలకు ఉత్తర్వులు జారీచేశారు. తూర్పుగోదావరి జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలు ఇంటి పన్ను, నీటిపన్ను డిజిటల్ విధానంలో యూపీఐక్యూఆర్‌2, పాయింట్ ఆన్ సేల్(పీవోఎస్) మెషీన్ల ద్వారా వసూలు చేయాలన్నారు. ఇక నుంచి ప్రతీఒక్క పన్ను, పన్నుయేతర వసూళ్లను అన్ని గ్రామ పంచాయతీలు డిజిటల్ విధానంలోనే చేపట్టాల్సి ఉందన్నారు. ఇప్పటికే డిజిటల్ నగదు చెల్లింపు వసూళ్లపరంగా తగినంత అవగాహన ఉందని, ఇక నుంచి అన్ని పంచాయతీల కార్యదర్శులు అన్ని రకాల లావాదేవీలను పారదర్శకతతో వ్యవహరించి నిర్వహించాలని కలెక్టర్ స్పష్టంచేశారు. భవనాలు, భూముల పన్నులు, క్రమబద్ధీకరణ(బీఎల్ఆర్) రుసుం, పిష్‌ట్యాంక్ లీజు రుసుములతోపాటు ఇతర అన్ని రకాల పన్నులు డిజిటల్ విధానంలో మాత్రమే చేయాలని, ఇది నూరుశాతం జరగాలన్నారు. ఈ ఉత్తర్వులు అతిక్రమించిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో తక్షణమే అమలులోకి వస్తాయని ఇన్‌చార్జి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.నాగలత తెలిపారు.



జేసీ చిన్నరాముడుతో కలసి సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

అలినేషన్ అనుమతుల కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతికి ఆయా శాఖల ఉన్నతాధికారుల ద్వారా భూముల పరాయికరణ (ల్యాండ్ అలినేషన్)కు సంబంధించి అనుమతుల మంజూరుకోసం ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల పరాయీకరణ భూములు పీవీజీటీ గ్రూప్స్, భూపతిపాలెం, పీఎం జన్మన్ గృహాలు వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ, ఏపీట్రాన్స్‌కో, ఎయిర్ పోర్టు, టూరిజం, క్రీడలు, జాతీయ రహదారులు, మార్కెటింగ్, పశుసంవర్ధక, విద్య, ఆరోగ్య తదితర శాఖలకు చెందిన 54 భూ సంబంధ అలినేషన్ ప్రక్రియపై శాఖాధికారులు దృష్టికి తీసుకుని వెళ్లడం, తగిన అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఆయా భూముల పరాయీకరణకి ఆర్డీవోలు జారీచేయాల్సిన అనుమతులు, మార్గదర్శకాలను అనుసరించి మంజూరుచేయాలని స్పష్టంచేశారు. జిల్లాలో ముఖ్యంగా బలహీన గిరిజన సమూహాలకు చెందిన 99 కుటుంబాలకు చెందిన 399 మందికి తగిన గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే ఈ విషయమై విచారణ చేపట్టామని, నివేదికల ఆధారంగా వారికి ప్రభుత్వపరంగా చేయూత ఇవ్వడంపై దృష్టిపెట్టాలని ఆర్డీవోలు, హౌసింగ్, రెవెన్యూ, ఐసీడీఎస్, డీఈవో, డీఆర్‌డీఏ, బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత, జిల్లాలో ఇతర శాఖల ఉన్నతాధికారులు డి.భాస్కర్‌రెడ్డి, కేఎన్ జ్యోతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

హిట్ అండ్ రన్ కేసుల్లో సుప్రీం ఆదేశాలు అనుసరించాలి

మోటారు వాహనాల ప్రమాదాలపై డీఎల్ఎస్ఏ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. మోటారు వాహనాల చట్టం 1988, హిట్ అండ్ రన్ మోటారు యాక్సిడెంట్ స్కీమ్ -2022 నిబంధనలను అనుసరిస్తూ బాధితులకు పరిహారం అందించేందుకు కమిటీలోని ప్రతి ఒక్కరూ సహకారాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆర్డీవోలు, ఆర్టీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీపై ఆక్రమణలు తొలగింపుపై ఆర్డీ విచారణ

కొవ్వూరు, జనవరి8(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో డ్రైనేజీపై ఆక్రమణలు తొలగింపుపై తలెత్తిన వివాదంపై మున్సిపల్ ఆర్డీ విచారణ చేపట్టారు. విజయవిహార్ సెంటర్‌లో హోటల్ నిర్వాహకులు వ్యర్థాలను డ్రైనేజీలోకి వదిలివేయడంతో దుర్గంధం వస్తోందని స్థానికులు ఆర్డీవోకు ఫిర్యాదుచేశారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదును పురస్కరించుకుని మున్సిపల్ అధికారులు ఫైర్‌ఇంజన్ సహాయంతో పారిశుధ్య పనులు చేపట్టగా ఫలితం లేకపోవడంతో హోటల్ భవనం వద్ద డ్రైనేజీపై పూర్తిగా కప్పివేసి నిర్మించిన ఆక్రమణలు తప్పనిసరి పరిస్థితుల్లో తొలగించారు. ఈ నేపథ్యంలో భవన యజమాని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం విచారణ చేపట్టారు. మున్సిపల్ అధికారులు, భవన యజమాని, మెయిన్‌రోడ్‌లోని ఇతర వ్యాపారస్తుల నుంచి వివరాలు సేకరించి, స్టేట్‌మెంట్లు ఆర్డీ రికార్డు చేసుకున్నారు.

హెచ్ఎంపీవీ వైరస్ నియంత్రణ, పర్యవేక్షణకు కమిటీ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆందోళన కల్గిస్తున్న హెచ్ఎంపీవీ వైరస్ నియంత్రణ, పర్యవేక్షణకు రాజమహేంద్రవరం జీటీజీహెచ్ (ప్రభుత్వ బోధనా సర్వజనాసుపత్రి)లో ఏడుగురు వైద్యులతో కూడిన కమిటీని నియమిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఆసుపత్రిలోని అందరు హెచ్‌వోడీలు, వైద్యులు, నర్సింగ్‌స్టాఫ్‌కు సర్క్యులర్‌ను జారీచేశారు. ఈ కమిటీకి జనరల్ మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా పీడియాట్రిక్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ సీఎస్ మోహనచంద్ర, మైక్రోబయాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఎం.భారతి, అనస్థీషియా విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్, పల్మనాలజీ విభాగం హెచ్‌వోడీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కిరణ్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పి.శ్రీనివాస్ ఉంటారు. క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటారు.





ప్రమాదంలో కారులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు.. తీవ్రంగా గాయపడిన సారిసిల్లి సాయి

టిప్పర్‌ని, చెట్టుని ఢీకొట్టిన కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు

అనపర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని వివేకానంద సెంటర్‌లో బుధవారం రాత్రి పది గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. దుప్పలపూడి నుంచి అనపర్తి వైపు వస్తున్న కారు దుప్పలపూడి వైపు వస్తున్న టిప్పర్ లారీని ఢీకొట్టింది. దీంతో కారు సుమారు 20 అడుగుల మేర వెనక్కు వెళ్లి చెట్టును ఢీకొట్టి నిలిచింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు కావడంతో కారు డ్రైవింగ్ చేస్తున్న సబ్బెళ్ళ ప్రకాష్‌రెడ్డి సీటులోనే ఇరుక్కుపోయి ఆర్తనాదాలు చేయసాగాడు. దీంతో స్థానికులు సహాయ చర్యలు చేపట్టి వెనుక సీటులో ఉన్న కొవ్వూరి మంగిరెడ్డి, పారిసిల్లి సాయిలను బయటకు తీసి ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కారులో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీసేందుకు సుమారు అరగంటపాటు కష్టపడాల్సి వచ్చింది. చివరకు గునపంతో కారు డోరును తప్పించి ప్రకాష్‌రెడ్డిని బయటకు తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కావడంతో వారికి అనపర్తి ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స జరిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక కాంట్రాక్టరు వద్ద ప్రకాష్‌రెడ్డి పనిచేస్తున్నాడు. బుధవారం మండపేట ఆసుపత్రి పని ఉందని యజమానిని కారు అడిగి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి పది గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తీరును చూస్తుంటే ఓవర్ స్పీడు కారణంగా కనిపిస్తోందన్నారు. తొలుత క్షతగాత్రులకు స్థానికంగా ప్రథమ చికిత్స చేసి అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

తెలుగు వైభవం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖుల విగ్రహాలు



బాలరాముని నమూనా ఆలయం వద్ద మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పూజలు


ఘనంగా తెలుగు మహాసభల తొలిరోజు పండుగ



ప్రముఖ కవి జొన్నవిత్తులకు సన్మానం

తెలుగు వెలుగైంది..ఆ వెలుగు ప్రపంచ తెలుగు మహాసభలకు వచ్చిన భాషాభిమానుల కళ్లల్లో కనిపించింది..రాజమహేంద్రవరం కేంద్రంగా గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తేనె పలుకుల సంపద అయిన అమ్మభాషకు అందలం దక్కింది.. ఆ మధుర క్షణాల్లో తనువు అణువణువు పులకించింది..







ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో చేసిన పలు ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ప్రధానంగా భువన విజయం, నెమలి నృత్య ప్రదర్శన, జానపద నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



స్టాల్స్‌ను తిలకిస్తున్న విద్యార్థులు


బాలరాముని ఆలయం

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభల వేడుకల్లో ప్రధాన వేదికను ఆనుకుని తీర్చిదిద్దిన అయోధ్య బాలరాముని నమూనా ఆలయం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. సాంకేతికతను వినియోగించి అయోధ్య బాలరాముని ఆలయం తీర్చిదిద్దినట్లు జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్ వెల్లడించారు. భక్తులు కోరిన విధంగా ఈ నమూనా ఆలయం తీర్చిదిద్దామన్నారు. అలాగే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అబ్దుల్ కలాం అవతార్(డిజిటల్) స్ర్కీన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడకు వచ్చి ఎవరైనా గౌరవప్రదమైన ప్రశ్నలు అడిగితే సరైన సమాధానాలు వారి నుంచి వస్తాయని చెప్పారు.



ముఖ్య అతిథులతో సభా వేదిక

'నిలువెత్తు' సంపద





ముగింపు సభలో మాట్లాడుతున్న లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్

యానాం ప్రజా ఉత్సవాలు సంక్రాంతిని తలపిస్తున్నాయి

● పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్

యానాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యానాం ప్రజా ఉత్సవాలు సంక్రాంతిని తలపిస్తున్నాయని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ అన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్త నిర్వహణలో జరిగిన యానాం ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శనల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగులో మాట్లాడి ఆశ్చర్యపరిచారు. 'తెలుగు భాష చాలా తీయనిది. 1965లో మద్రాసులో చదువుకున్న సమయంలో నాకు ఎక్కువ మంది స్నేహితులు గుంటూరు, గూడూరు, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ వారే ఉండేవారు. వారితో ఎక్కువగా సాన్నిహిత్యం ఉండేది. వారితో కలిసి తెలుగు సినిమాలు చూసేవాడిని' అన్నారు. మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇంతమంది ప్రజలు ఒక్కచోట చేరినందుకు, ప్రజా ఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శనల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నూతన సంవత్సరారంభంలో గొప్ప సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగం కావడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. పవిత్రమైన గోదావరి బంగాళాఖాతంలో కలిసే ఈ అందమైన ప్రాంతం యానాం. దేశమంతటా... ముఖ్యంగా పుదుచ్చేరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రధాని మోదీ సంకల్పిస్తున్నారన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ముందుగానే పండుగ వాతావరణం వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నారన్నారు. ముఖ్యంగా అందరి సమష్టి కృషితో యానాం పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చేందేందుకు ఎక్కువగా అవకాశాలున్నాయి. యానాం అభివృద్ధికి తగిన సహకారం అందజేస్తామన్నారు. అనంతరం పర్యాటక శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడారు. గవర్నర్‌కు ఢిల్లీ ప్రతినిధి మల్లాడితో పాటు మల్లాడి అభిమాన సంఘం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పౌర సన్మానం చేశారు. యానాంలో పలు అభివృద్ధి పనులను గవర్నర్ కైలాష్‌నాథన్ ప్రారంభించారు.



లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి మల్లాడి







ప్రజా ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆకట్టుకున్న లేజర్ షో

అట్టహాసంగా ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

యానాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులు జరిగిన 21వ యానాం ప్రజా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రత్యేక నృత్యాలు, ఫ్యాషన్ షో అలరించాయి. చివరి రోజైన బుధవారం విశాఖపట్నానికి చెందిన విక్టరీ ఈవెంట్ మేకర్స్ మేడిది విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైకా, లేజర్ షో, ఫైర్‌షో, ముంబయి డ్యాన్స్, కోల్‌కత్తా డ్యాన్స్, అంధేరా డ్యాన్స్, చెన్నయ్‌కు చెందిన సంపత్ జంగ్లీగ్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బృందం సినీ ఆర్కెస్ట్రా నిర్వహించారు. ప్రముఖ గాయకులు ఆలపించిన సినీ గీతాలు ఆహూతులను అలరించాయి. అనంతరం నృత్య పోటీల్లో గెలుపొందిన వారితో ప్రదర్శనలు ఇప్పించాయి. టీవీ, ఫిలిం ఆర్కెస్ట్రా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాజశేఖరన్ నేతృత్వంలో సీఐ షణ్ముగం బందోబస్తు చర్యలు చేపట్టారు.







ప్రముఖ గాయకుడు శ్రీకృష్ణ బృందం సినీ సంగీత విభావరి

ఏడీబీ రహదారి పనుల ప్రక్రియపై సమగ్ర వివరాలు ఇవ్వండి

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏడీబీ నిధులతో చేపట్టిన రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేసే క్రమంలో వాటికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్‌పరంగా సేకరణ ప్రక్రియపై సమగ్ర వివరాలు తనకు అందజేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ అధికారులతో ఏడీబీ రోడ్డు పనులపై బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ-రాజానగరం వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ క్రమంలో రహదారి నిర్మాణ పనులకు ఆటకం లేకుండా చూడాలన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రాజెక్ట్ అధికారిగా జేసీ, భూసేకరణ అధికారిగా రాజమహేంద్రవరం ఆర్డీవో, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా రాష్ట్ర హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రహదారి విస్తరణకు మొత్తం 72.16 ఎకరాల భూమి సేకరణ చేపట్టాల్సిఉంటుందన్నారు.ఇందులో 57.69 ఎకరాలు ప్రైవేట్ భూమి సేకరించగాతూర్పుగోదావరి జిల్లాలో 34.11 ఎకరాల భూమి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీకి అప్పగించామన్నారు. ఆక్రమణలకు పాల్పడినవారిని ఖాళీ చేయించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ చిన్నరాముడు, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఈఈ శ్రీకాంత్, డీఈ రాజానగరం, రంగంపేట తహసీల్దార్ లావణ్య, కె.అనసూయ పాల్గొన్నారు.



రంగంపేట మండలం ఎస్టీరాజాపురంలో ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

రంగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ-రాజానగరం ప్రధాన రహదారి మార్గంలో ఏపీరహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడీబీ నిధులతో చేపట్టిన పనులను పూర్తి చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజానగరం, రంగంపేట మండలాల పరిధిలో ఏడీబీ రోడ్ రహదారి పనులను, భూసేకరణ విషయంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు జేసీ చిన్నరాముడుతో కలిసి బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.

నష్టపరిహారం ఇప్పించి నిర్మించండి

జేసీ చినరాముడు రంగంపేట, పెదరాయవరం తదితర గ్రామాలకు చెందిన ప్రాంతాల్లో రహదారి మార్గాన్ని పరిశీలించారు. రంగంపేట సెంటర్‌లోని షాపుల యజమానులతో మాట్లాడారు. షాపులను స్వచ్ఛందంగా ఖాళీచేయాలని చెప్పగా రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇల్లు, షాపులు పోతున్నందున తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని, ఇల్లు కోల్పోతున్నవారికి వేరేచోట ఇళ్ల స్థలాలు ఇస్తామన్నా ఇవ్వలేదని, షాపుల కోల్పోతున్నందున తమ కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వస్తుందన్నారు. దానికి స్పందించిన జేసీ త్వరలో భూమి కోల్పోతున్న రైతులకు, షాపుల యజమానులకు సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్, రాజానగరం, రంగంపేట తహశీల్దార్‌లు లావణ్య, కోసు అనసూయ పాల్గొన్నారు.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

● కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రోడ్ల అభివృద్ధి ● కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ● ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు


సభలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు త్వరలో చెల్లించనుందని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ పీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో బుధవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ముగింపు కార్యక్రమం జరిగింది. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షే మమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జలజీవన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.21వేలకోట్లు ఏపీకి మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు ధ్వంసం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున పరిశ్రమలు రానున్నాయన్నారు. ఎన్డీఏ అధికారంలోకి రావడంలో యూటీఎఫ్ ఉపాధ్యాయుల పాత్ర కూడా ఉందన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.

సభలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి యూటీఎఫ్ నిరంతరం ఉపాధ్యాయుల కోసం పనిచేస్తుందన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ 140ఏళ్ల చరిత్ర కల్గిన రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ కళాశాల ఇదేనని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు 67 దేశాల్లో వివిధ ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్, మోడల్‌స్కూల్, పంచాయతీరాజ్, కస్తూరిబా పాఠశాలలు ఇలా అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు యూటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యూటీఎఫ్ కార్యాచరణ రూపొందించిందన్నారు. ఫిబ్రవరి 17వతేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. దీని కోసం తొలుత ఫిబ్రవరి 2న విజయవాడలో సదస్సు నిర్వహిస్తామని తర్వాత ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, ఉత్తర రాయలసీమ, దక్షిణ రాయలసీమల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో ఉండాలని.. అవసరమైతే ఎల్‌కేజీ, యూకేజీలు కూడా వీటిలో నిర్వహించాలని తీర్మానించారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృ భాషలో జరగాలని తీర్మానించారు. హైస్కూల్‌లో రెండు మీడియంల్లో బోధన కొనసాగాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్య దర్శి గిరిధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం, సాంకేతిక స్పృహ పెంచాలని ఆయన కోరారు.


వేదికపై నేనొక కవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

పలు తీర్మానాలు

ముగింపు సభలో పలు తీర్మానాలు చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, 117 జీవో రద్దు చేయాలని తీర్మానించారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పునరుద్ధరించాలని, హైస్కూల్‌లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంల్లో కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు కల్పించాలి. 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించాలి. మధ్యంతర భృతి వెంటనే చెల్లించాలని తీర్మానించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. ఉపాధ్యాయులపై ఉన్న యాప్స్ భారం తగ్గించాలి. ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యను బలోపేతానికి చర్యలు తీసుకోవాలి. జాతీయ నూతన విద్యావిధానం 2020ను రద్దు చేయాలి. కామన్ సర్వీస్ రూల్స్ సాధన, జూనియర్ లెక్చరర్స్ పదోన్నతులు, మున్సిపల్ టీచర్లు, ట్రైబుల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు. ఇలా మొత్తంగా 15 తీర్మానాలు చేశారు. సభ ఏకగ్రీవంగా వాటిని ఆమోదించింది. అనంతరం యూటీఎఫ్ సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు అందజేశారు.

నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు

నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గానికి ఎమ్మెల్సీలు గోపిమూర్తి, కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేయాలని ఆకాంక్షించారు. మహాసభలు విజయవంతంఅవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తిలు ధన్యవాదాలు తెలిపారు. అన్ని కార్యక్రమాలు విజయవంతానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.


వేదికపై పాటలు పాడుతున్న ఉపాధ్యాయ బృందం

మహా చైతన్యం నింపాయి


కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు 20వేల మంది ఉపాధ్యాయుల్లో మహా చైతన్యం నింపాయి. ఉపాధ్యాయులందరూ ఒకే చోట చేరి విజ్ఞానం పంచుకున్నాం. ఇలాంటి సభలు నిర్వహించడం వల్ల విద్యావికాసం జరుగుతుంది. ఇక్కడే 25ఏళ్ల క్రితం రజతోత్సవాలు, ఇప్పుడు స్వర్ణోత్సవాలు జరగడం విశేషం.

ఐ.ప్రసాద్‌రావు, ఉపాధ్యాయుడు, కాకినాడ జిల్లా

విజ్ఞానం వెల్లి విరిసింది


స్వర్ణోత్సవాల్లో భాగంగా జరిగిన విద్యా వైజ్ఞానిక సదస్సుల వల్ల ఉపాధ్యాయుల్లో విజ్ఞానం వెల్లి విరిసింది. కొత్త స్ఫూర్తిని ఇచ్చింది. జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రఖ్యాతగాంచిన విద్యావేత్తలు, మేధావులు వచ్చి సరికొత్త విషయాలు తెలియజేశారు. సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లకు అనుగుణంగా విద్యార్థులకు బోధన ఎలా చేయాలో నేర్పించారు.

సీహెచ్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, తూర్పుగోదావరిజిల్లా

మహిళా వికాసానికి నాంది


యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా సాహితీ సదస్సు మహిళల వికాసానికి నాంది పలికింది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో మహిళా ఉద్యమ నేతలు వివరించారు. మహిళా రచనలు, మహిళల సాహిత్యం ఎంతో ఆకట్టుకుంది.

బి.చంద్రకళ, ఉపాధ్యాయురాలు, కోనసీమజిల్లా

ఫిబ్రవరి 1 నుంచి

భూముల మార్కెట్ విలువ పెంపు


ముమ్మిడివరంలో రికార్డులు పరిశీలిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ

ముమ్మిడివరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్‌లకు జూమ్ మీటింగ్ నిర్వహించి దశా దిశా నిర్దేశించినట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ బి.శివరామ్ తెలిపారు. ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ భూముల మార్కెట్ విలువ పెంపు విషయంపై తహశీల్దార్లు, వీఆర్వోలు, నగర పంచాయతీ అధికారులు, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లతో చర్చించి రీ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించామన్నారు. వారికి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామన్నారు. ఈనెల 10వ తేదీ వరకు రీ వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. జనవరి 17న ఫైనల్‌గా అప్రూవల్ తీసుకోవడం జరుగుతుందని, కమిటీ చైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్, సభ్యునిగా మున్సిపల్ కమిషనర్, సబ్‌రిజిస్టర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. 18న డేటా ఎంట్రీ జరుగుతుందని, అభ్యంతరాల స్వీకరణ కోసం ప్రజల ముందు ఉంచడం జరుగుతుందన్నారు. 24న అభ్యంతరాలు స్వీకరిస్తామని, 25న ఫైనల్ వాల్యూస్ కమిటీ అప్రూవల్ చేస్తుందన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెంచిన నూతన రేట్లు అమలులోకి వస్తాయని ఆయన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ ఎం.సుధాకరరావు, సిబ్బంది ఉన్నారు.

కత్తితో పదో తరగతి విద్యార్థి హల్‌చల్

ఇంటర్ విద్యార్థిని

చంపుతానని బెదిరింపు

గొల్లప్రోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని చంపుతానని బెదిరించడమే గాక, కత్తితో హల్‌చల్ చేసిన పదో తరగతి విద్యార్థిపై గొల్లప్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా చెందుర్తి గ్రామానికి చెందిన బాలుడు గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బాలిక గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆమె గురించి పదో తరగతి విద్యార్థి తప్పుగా ప్రచారం చేయడంపై గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాల వద్దకు వచ్చిన బాలుడిని విద్యార్థిని ప్రశ్నించింది. దీంతో ఆగ్రహించిన పదో తరగతి విద్యార్థి ఆమెపై దాడికి ప్రయత్నించాడు. స్థానికులు అడ్డుకోవడంతో సంచిలో నుంచి కత్తిని తీసి బెదిరించాడు. విద్యార్థినిని చంపేస్తానంటూ వీరంగం చేశాడు. దీంతో స్థానికులు బాలుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడ పుస్తకాల బ్యాగు, కత్తి వదిలివేసి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

12,19 తేదీల్లో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12, 19వ తేదీల్లో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 12న ఇండియన్ రౌండ్ విభాగంలో జూనియర్స్ బాలబాలికలకు ఉదయం 8గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. జూనియర్స్ రికర్వ్ బాయ్స్ అండ్ గరల్స్ విభాగంలో పోటీలు ఈనెల 19న రాజమహేంద్రవరం మోడల్ కాలనీ ఆర్చరీ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతాయని చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబరచినవారిని రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఆర్చరీ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆర్చర్స్ ఆధార్‌కార్డు, పుట్టిన తేది ధృవీకరణ పత్రం జిరాక్స్ తీసుకురావాలని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలిచినవారు 2004 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ 99890 01162లో సంప్రదించాలని సూచించారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు 8వ రోజైన బుధవారం కూడా కొనసాగాయి. ఈ పరీక్షల్లో(పీఎంటీ, పీఈటీ) మొత్తం 350మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 260మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు బుధవారం ఈ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వీటిని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.

కె.పెదపూడిలో ఉద్రిక్త పరిస్థితులు

సంక్రాంతి ఫ్లెక్సీ, రంగా విగ్రహం

ఏర్పాటుతో వివాదం

భారీగా పోలీసుల మోహరింపు

పోలీస్ పికెట్ ఏర్పాటు


రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం


స్థానికులతో చర్చిస్తున్న అధికారులు

అంబాజీపేట, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీల ఏర్పాటు... రంగా విగ్రహం ఆవిష్కరణతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.పెదపూడి గాంధీ సెంటర్లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం సంక్రాంతి శుభాకాంక్షలు పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీని పక్కనే కాపు సామాజిక వర్గానికి చెందిన యువత రెండు రోజుల క్రితం మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ యూత్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ప్రాంతంలో అక్కడ సంక్రాంతి సందర్భంగా భోగి మంటలు వేసే స్థలం కావడంతో వివాదం ముదిరింది. దీంతో మంగళవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం పక్కన కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని కాపు సామాజికవర్గానికి చెందిన వారు ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, పోలీసులు రంగప్రవేశం చేసి రంగా విగ్రహం అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేశారని ఉద్రిక్తత పరిస్థితుల నడుమ తొలగించారు. అడ్డువచ్చిన కాపు సామాజిక వర్గీయులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ విషయం మండలవ్యాప్తంగా తెలియడంతో కాపు సామాజిక వర్గీయులు కె.పెదపూడికి చేరుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్ ఐలు శివకృష్ణ, ఏ.చైతన్యకుమార్, సురేంద్ర పోలీస్ బలగాలతో అక్కడికి చేరుకున్నారు. అలాగే ఎంపీడీవో జీవీ సరోవరరావు అక్కడికి చేరుకున్నారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాపు సామాజికవర్గీయులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, స్థానికులు చిక్కం ఏసు, పల్లంరాజు, రాయపురెడ్డి సత్యనారాయణతో సీఐ విద్యాసాగర్, ఎంపీడీవో సరోవరరావు చర్చించారు. కె.పెదపూడి సెంటర్‌లో అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేశారని, వాటిని కూడా తొలగించాలని అప్పుడు రంగా విగ్రహాన్ని తొలగిస్తామని ఆగ్రహించారు. ఓ దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని వారించారు. పరిస్థితి మారడంతో ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలో శాంతి కమిటీని ఏర్పాటు చేసి ఇక్కడ సమస్యలు, పరిస్థితులు చర్చిద్దామని సూచించారు. అప్పటి వరకు ఏ విగ్రహాలు తొలగించవద్దని, ఎలా ఉందో అలానే ఉంచాలని సూచించారు. దీంతో విషయం సద్దుమణిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కె.పెదపూడి సెంటర్‌లో పికెట్ ఏర్పాటు చేస్తామని సీఐ విద్యాసాగర్ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అభిమానుల కుటుంబాలకు

సినీ హీరో రామ్‌చరణ్ రూ.10 లక్షల సాయం


మణికంఠ తల్లికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు


చరణ్ తండ్రి అప్పారావుకు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన ఇద్దరు అభిమానుల కుటుంబ సభ్యులకు సినీ హీరో రామ్‌చరణ్ రూ.10లక్షలు ప్రతినిధుల ద్వారా అందజేశారు. బుధవారం కాకినాడ రాజేశ్వరినగర్, అశోక్‌నగర్‌లో గల మృతులు అరవ మణికంఠ, తోకాడ చరణ్‌ల ఇళ్లకు రామ్‌చరణ్ ఆదేశాల మేరకు చిరంజీవి యువత ప్రతినిధులు వెళ్లి చెరో రూ.5 లక్షల వంతున రూ.10 లక్షల చెక్కును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. మణికంఠ, చరణ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిరంజీవి యువత ప్రతినిధులు మాట్లాడుతూ చరణ్ అభిమానులు ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం ఎంతో బాధకరమన్నారు. రూ.10 లక్షలను రామ్‌చరణ్ ఆర్‌టీజీఎస్ ద్వారా నగదును బాధిత కుటుంబ సభ్యులకు పంపించారని, నగదు లావాదేవీల వివరాలను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత ప్రతినిధులు గరగా రామ్, విజ్జన శివ, చింతకాయల చిన్ని, కె.బాబీ, వై.బాబీ తదితరులు పాల్గొన్నారు.

160 కోడి కత్తులు స్వాధీనం

ఏలేశ్వరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సర్కిల్ పరిధిలో 160 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌డీపీవో శ్రీహరిరాజు తెలిపారు. ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో ఎస్ఐ రామలింగేశ్వరరావుకు వచ్చిన సమాచారం ఆధారంగా దిబ్బలపాలెంలో చర్యలు చేపట్టామన్నారు. ఎదురాడ మల్లేశ్వరరావు అనే వ్యక్తి నుంచి కోడి పందాలకు ఉపయోగించే 160 కత్తులను స్వాధీనపర్చుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సంక్రాంతి పేరుతో అనధికారికంగా జూదాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కోడి పందేలు నిర్వహించేవారిని, పాత కేసుల్లో నిందితుల్ని బైండోవర్ చేస్తామన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

మోతుగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం డొంకరాయిలో గంజాయి లిక్విడ్‌తో పాటు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి గ్రామ శివారున శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన రాహుల్ చంద్ర కాప్రి అనుమానాస్పదంగా ఉండడంతో పట్టుకున్నారు. మధ్యవర్తులు, లక్కవరం ఎఫ్‌ఆర్‌ఓ వెంకట నానాజీ సమక్షంలో పరిశీలించగా అతడి వద్ద రూ.5లక్షలు విలువ చేసే 2 కిలోల లిక్విడ్ గంజాయి ఉన్నట్టు గుర్తించి అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

భర్త మృతి తట్టుకోలేక..


బ్రెయిన్ స్ట్రోక్‌తో భార్య మృతి


సూర్యప్రకాశరావు, భాగ్యలక్ష్మి (ఫైల్)

కె.గంగవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భర్త అకాల మరణం జీర్ణించుకోలేక భార్య మృతిచెందిన సంఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో జరిగింది. నాళం సూర్యప్రకాశరావు(సూరిబాబు)(54), సూర్యవెంకట భాగ్యలక్ష్మి (బంగారమ్మ)(48) భార్యాభర్తలు. వారు అముజూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు. పాణింగపల్లి గ్రామంలో కిరాణా షాపు నిర్వహించుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సూరిబాబు ఈనెల 1న అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త మృతితో తీవ్ర మనోవేదనకు గురైన బంగారమ్మ అయన లేని జీవితాన్ని జీర్ణించుకోలేకపోయింది. దుఃఖంతో కుంగిపోయింది. మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందింది. భార్యాభర్తలు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

కుమార్తె మరణవార్త విని...

తండ్రికి గుండెపోటు


గంగాభవానీ (ఫైల్)

కొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుమార్తె మరణ వార్త తెలిసి తండ్రి గుండె పోటుకు గురైన సంఘటన కాకినాడ జిల్లా ఉప్పాడలో జరిగింది. గ్రామస్తులు సమాచారం మేరకు... స్థానిక రామిశెట్టిపేటకు చెందిన రామిశెట్టి గంగాభవానీ(18) కృష్ణాజిల్లా తాడిగడప శ్రీ చైతన్యకాళాశాలలో నీట్ కోచింగ్ తీసుకుంటుంది. బుధవారం భవానీ గుండెపోటుతో మరణించిందని శ్రీచైతన్యకళాశాల నుంచి వేమన్నకు సమాచారం అందింది. అతడికి విపరీతమైన గుండెనొప్పి రావడంతో స్థానికంగా చికిత్స చేయించి కాకినాడకు తరలించారు.

రేపు వాడపల్లిలో ఉత్తర ద్వార దర్శనం


వాడపల్లి వెంకన్న ఆలయంలో ఏర్పాట్ల దృశ్యం

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఆత్రేయపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు ఈ నెల 10 శుక్రవారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు వైకుంఠ ద్వారా స్వామిని దర్శించుకునే ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయాన్ని ఫలపుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సప్త ద్వారాల గుండా శ్రీమహావిష్ణుమూర్తి శేషపాన్పుపై భక్తులకు అభయ హస్తం అందించనున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శన ప్రవేశం కల్పిస్తూ ఏర్పాట్లు చేపడుతున్నారు. గరుడ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించనున్నారు.

ప్రతిచోట సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలి

అన్నవరం దేవస్థానం ఈవో


అన్నదాన విభాగంలో భక్తుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి వచ్చే భక్తులు ఎక్కడా ఇబ్బందిపడకుండా అన్నవరం విచ్చేసినప్పటి నుంచి తిరుగు ప్రయాణమయ్యే వరకు ప్రతిచోట సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలని ఈవో సుబ్బారావు ఆదేశించారు. వాటి ద్వారా భక్తులు ఎవ్వరినీ సంప్రదించకుండా నేరుగా వ్రతాలు, దర్శనాలు పూర్తిచేసుకోవచ్చన్నారు. బుధవారం రత్నగిరిపై పీఆర్వో, రిసెప్షన్, వ్రతమండపాలు, అన్నదాన విభాగాలను ఆయన పరిశీలించారు. యాగశాల వద్ద ఏర్పాటుచేసిన బోర్డు స్పష్టంగా లేకపోవడంతో సరిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులను దేవస్థానం అన్నదానంలో రుచి, శుచి ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, సూపరెంటెండెంట్‌లు మూర్తి, ఐవీ రామారావు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ

జేఎన్టీయూకే, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యావిభాగం కార్యదర్శి కోన శశిధర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో ముగ్గురు విద్యావేత్తల పేర్లు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున నామినీగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వపు వీసీ ప్రొఫెసర్ కె.నిరుపరాణిని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తరుపున నామినీగా జేఎన్టీయూహెచ్ పూర్వపు వీసీ ప్రొఫెసర్ డీఎన్ రెడ్డిని, యూజీసీ నామినీగా మద్రాస్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీజీహినాధన్‌కామకోటిని నియమించారు. ఈ నామినీలు జేఎన్టీయూకే ఉపకులపతి పదవి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు పేర్లను గవర్నర్‌కు పంపుతారు. జేఎన్టీయూకే ఉపకులపతిగా వాటిలోని ఒకరి పేరును గవర్నర్ ఖరారుచేస్తారు. అయితే వీసీ పదవి కోసం జేఎన్టీయూకే నుంచి సుమారు 20 మంది వరకూ ప్రొఫెసర్లు దరఖాస్తు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా కేవీఎస్‌జీ మురళీకృష్ణ కొనసాగుతున్నారు.

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం

కాకినాడ సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్ పులవర్తివారివీధిలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్యేక అతిథిగా కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) విచ్చేశారు. కాకినాడ షోరూమ్ భూయజమాని పాబోలు బాబూరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, తుని షోరూమ్ భూయజమాని గ్రంధి నారాయణరావు(బాబ్జీ) పాల్గొన్నారు. సంఘ సేవకుడు సోము దుర్గాప్రసాద్ మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన కాకినాడలో తమ షోరూమ్‌ను ఎప్పటి నుంచో ప్రారంభించాలనుకున్నామని, ఇప్పుడు పండుగ మాసంలో కుదరరడం చాలా సంతోషంగా ఉందన్నారు. వినూత్నమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్నిరకాల 22 కేటీ బంగారు ఆభరణాలను ఫ్లాట్ 6శాతం తరుగుకే పొందవచ్చన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరి లేదన్నారు. జీఎస్టీని కూడా కొనుగోలుదారుల తరపున తామే చెల్లిస్తామన్నారు. అదనంగా వెండి వస్తువుల కొనుగోలుపై కిలోకి రూ.10వేల తగ్గింపు ఉంటుందని, ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్ రాజులతో పాటు పి.వెంకట నాగసూర్య పున్నయ్య, పి.వెంకట సింహాచలం, గుల్లపూడి నందు, పేకేటి ఈశ్వర్లు కాకినాడ నగర మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణకుమార్, నగరనాయకుడు నున్న దొరబాబు పాల్గొన్నారు.


షోరూమ్‌ను ప్రారంభించిన ఎంపీ ఉదయ్

కందుకూరి ఆస్తుల పరిరక్షణకు

చర్యలు తీసుకుంటాం

● విద్యాదాత మేడూరి జయంతిలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



మేడూరి జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త కందుకూరి వీరేలింగం పంతులు ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీకళాశాల ప్రాంగణంలో వీటీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, విద్యాదాత మేడూరి సత్యనారాయణ 106వ జయంతి వేడుక సందర్భంగా మేడూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రిటైర్డ్ ఆదాయపన్నులశాఖ అధికారి మేడిశెట్టి తిరుమలకుమార్, అధ్యక్షుడు మేడూరి కుమార్తె మారిశెట్టి కృష్ణకుమారి, కార్యదర్శి సానబోయిన రామారావు, కోశాధికారి మారిశెట్టి అరుణ, సహాయ కార్యదర్శి కేసన సుధాకర్, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్ రావు, రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర వైస్‌చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, డాక్టర్ అనుసూరి పద్మలత ,వీటీ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావులతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మేడూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వాసు మాట్లాడుతూ కందుకూరి ఆశయ సాధన కోసం మేడూరి కృషిచేశారని చెప్పారు. వీటీ విద్యాసంస్థల చరిత్ర ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు తెలియజెప్పాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. అనంతరం మేడూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఎమ్మెల్యే వాసు అందజేశారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

:రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలలో నిర్మిస్తున్న రహదారులు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరిశీలించారు. బుధవారం స్థానిక 22వ డివిజన్‌లో బారువీధిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులుచూసి ఆదిరెడ్డి వాసు అక్కడ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులను తనిఖీ చేశారు. మధ్యాహ్నం నుంచి స్థానిక 3, 35, 36, 38, 39 డివిజన్లలో మహిళలను ప్రోత్సహిస్తూ ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న మహిళలను అభినందించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు ఈనెల 11న పుష్కరాల రేవులో జరిగే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు అందిస్తామని వాసు చెప్పారు.

సన్నిధానం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

రాజమహేంద్రవరంకల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను సమతూకం చేసుకుంటూ, విభిన్నరీతిలో సన్నిధానం నరసింహశర్మ చేస్తున్న సాహితీ సమార్చన మరింత ముందుకు సాగాలని, పద్మభూషణ్, పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆకాంక్షించారు. సన్నిధానం నరసింహశర్మ ఎనభై వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రచురించిన ప్రత్యేక సంచిక సాహితీ సంకీర్తకుడు సన్నిధానంను పద్మభూషణ్ యార్లగడ్డ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సన్నిధానం శాస్త్రి, నిమ్మగడ్డ రామకృష్ణ తదితర సాహితీ ప్రియులు పాల్గొన్నారు. అనంతరం మహాసహస్రావధాని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావుకు ఆవిష్కరించిన ప్రత్యేక సంచికను సన్నిధానం శాస్త్రి అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ విక్రయాన్ని విరమించాలి

● రాజమహేంద్రవరంలో సీపీఐ వినూత్న నిరసన



మోకాళ్లపై కూర్చుని చేతిలో చిప్పతో వినూత్నంగా నిరసన తెలియజేస్తున్న సీపీఐ శ్రేణులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) :విశాఖ స్టీల్ ప్లాంటు విక్రయించాలనే ప్రతిపాదన విరమించాలని, దీనిపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని జాంపేట గాంధీ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిల్చుని చిప్ప పట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మధు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారు కానీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మాత్రం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వకపోవడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. లక్షలాది మందికి ఉపాధికల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నట్టేట ముంచుతూ పక్కనున్న అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆఘమేఘాలమీద చర్యలు తీసుకోవడం ఏమిటని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే పోలవరం ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని, నిర్వాసితులకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాజమహేంద్రవరంకల్చరల్ జనవరి8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు విశ్వనాదం భాస్కరరామ్ అధ్యక్షతన డిగ్రీ కాలేజీ నూతన పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కుని ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడిగా రౌతు సూర్యప్రకాశరావు, అధ్యక్షుడిగా మద్దూరి శివ సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా కందుల బుచ్చిరామ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా డాక్టర్ గొర్ల రమణయ్య, జాయింట్ డైరెక్టర్‌గా అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కోశాధికారిగా ముత్తంగి వెంకట వేణుగోపాల్, గౌరవ సెక్రటరీగా జమ్మి రామారావు ఎన్నికయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం, కళాశాల ఆవరణలో గల ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి, కళాశాల వ్యవస్థాపకుడు వైఎస్ నరసింహారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కళాశాలలో త్వరలో బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, బీఎస్‌సి(యానిమేషన్) కోర్సులు ప్రవేశపెట్టడానికి కమిటీ తీర్మానించింది.

అనధికార కట్టడంపై నిర్లక్ష్యం వహించిన అధికారిపై చర్యలు

● కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనధికార కట్టడాలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా విధులలో నిర్లక్ష్యం వహించిన ప్లానింగ్ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ను రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషన్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం నగరంలో డపింగ్ యార్డు, ఎంట్రో యానిట్, లెగసీ వ్యర్థాలు, కనస్ట్రక్షన్ అండ్ డిమోలిషన్ ప్లాంట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హుకుంపేట వద్ద సేవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న క్రమంలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ సమీపంలో నిర్మించిన గుడి వద్ద అదనపు కట్టడాలను చూశారు. అదనపు కట్టడాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. సేవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను వెంటనే ఉపయోగంలోకి తీసురావాలని ఆదేశించారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ పనితీరు మెరుగుపరచాలని, డంపింగ్ యార్డును పరిశీలించిన క్రమంలో ఆ డంపింగ్ యార్డు వద్ద ఎంట్రన్స్‌లో బోరు వేయాలని ఆదేశించారు. ప్రస్తుతం చెత్తను వేస్తున్న డంప్ యార్డును శానిటరీ ల్యాండ్ ఫిల్ చేయటానికి తగిన అంచనాలు తయారు చేయాలన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి ఉంచడానికి కంపార్టుమెంట్‌లు ఏర్పాటుచేయాలన్నారు. ఇన్సినిరేటర్లు నడవడానికి ఆపరేటర్లను ఏర్పాటు చేసుకోవాలని, మొత్తం అన్ని కరెంటుతో నడిచే యంత్రాలు కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి సంరక్షించుకోవటానికి ఎలక్ట్రీషియన్లను నియమించుకోవాలని ఆదేశించారు. అన్ని ప్లాంట్లు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో మొదటి 10 స్థానాల్లో రాజమహేంద్రవరం ఉండేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఐ.పాండురంగారావు, సీటీ ప్లానర్ కోటయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, డిప్యూటీ సీటీ ప్లానర్ సత్యనారాయణరాజు, ఈఈ ఎంవీకె మాధవీ, డీఈఈ కె.సత్యనారాయణ, విరూపాక్షరావు పాల్గొన్నారు.

షిర్డీసాయిలో సంక్రాంతి సంబరాలు



కడియం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):కడియం షిర్డీసాయి విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు అంబరానంటాయి. సాంప్రదాయ పండుగల్లో సంక్రాంతిని విద్యార్థులు కళ్లకు కట్టినట్లు చూపించారు. హరిదాసులు, గాలిపటాలు, గంగిరెద్దు, సోదమ్మ, పిట్టలదొర, గోదాదేవి, జ ంగం దేవర, కొమ్మదాసరి, లక్ష్మీదేవి, విష్ణువు వంటి చిన్నారుల వేషధారణలు అలరించాయి. బోగిమంటలు వెలిగించారు. చిన్నారులకు బోగిపళ్ళు వేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా డా.కవితా దాసరి పాల్గొన్నారు. శ్రీ షిర్డిసాయి విద్యానికేతన్ చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు మాట్లాడుతూ చిన్నతనం నుంచి మన తెలుగు సాంప్రదాయలు, మన పండుగలు తెలియ చెప్పే విధంగా ప్రతీ ఏటా ఈ విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రూపస్‌రావు

రంగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రూపస్‌రావు ఎన్నికయ్యారని మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, విజయ్‌బాబులు తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవమహాసభల అనంతరం జె.రూపస్‌రావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగాఎన్నుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మురళీకొండపై ఒక ఇంట్లో నిల్వచేసిన 3200 కేజీల పీడీఎస్ బియ్యంను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే దవళేశ్వరానికి చెందిన సప్తగిరి, గణేష్ ఇద్దరు కలిసి పీడీఎస్ బియ్యాన్ని మురళీకొండపై దాచివుంచినట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంలో వారు దాడి చేసి పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్‌చేసి ఇద్దరినీ బొమ్మూరు పోలీసులకు అప్పగించారు. ఈమేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ బ్యాగులోంచి బంగారం అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ బయట బస్సు ఎక్కుతున్న ఒక మహిళ బ్యాగులోంచి గుర్తుతెలియని దొంగలు 108 గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. టూటౌన్ పోలీసులు కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే .. డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన శ్రీరామ రేవతి అనే మహిళ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈనేపథ్యంలో తన స్వగ్రామం వెళ్లేందుకు మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి రైలులో బయలు దేరి బుధవారం రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. బయటకు వచ్చి రామచంద్రపురం ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నక్రమంలో గుర్తుతెలియని దొంగలు ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని 108 గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. బ్యాగును లాగినట్లుగా అనిపించడంలో వెంటనే ఆమె గుర్తించిన తెలియలేదు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కడియం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలుపై కడియం ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ జరిగింది. మధ్యాహ్న భోజనం అమలు, బియ్యం, గుడ్డు, చిక్కీలు, రాగిజావ రికార్డులను తనిఖీ చేశారు. ఆర్‌వో ప్లాంట్, తరగతి గదులు, టాయిలెట్స్ పరిశుభ్రత అంశాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీ డీఆర్‌పీలు రేవు నాగేశ్వరరావు, కొమ్మర సూర్యప్రకాశ్‌లు రికార్డులు పరిశీలించారు. చదువుపై ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఎస్‌ఎంసీ అధ్యక్షురాలు గారపాటి సత్య, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, డేవిడ్ వీరబాబు ఉన్నారు.

14న తిరువాభరణ మహోత్సవం

రాజమహేంద్రవరంకల్చరల్ జనవరి8(ఆంధ్రజ్యోతి): గౌతమీఘాట్ రోడ్డులో గల అయ్యప్ప స్వామి ఆలయంలో, మకర సంక్రాంతిరోజున తిరువాభరణ మహోత్సవం నిర్వహిస్తామని, శ్రీ ధర్మశాస్త్రా ఆ.ధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకులు జక్కంపూడి విజయలక్ష్మి,ఆలయ ట్రస్టీలు చల్లా శంకర్రావు, పోలసానపల్లి హనుమంతరావు, మంతెన కేశవరాజు తెలిపారు. బుధవారం అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముందుగా జక్కంపూడి రామ్మోహనరావు స్వగృహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, సీతంపేటలోని అరిగెల బాబు నివాసం నుంచి తిరువాభరణ మహోత్సవం ప్రారంభమై,స్వాములతో ఊరేగింపుగా బయలుదేరి దేవిచౌక్, కోటగుమ్మం, మెయిన్‌రోడ్, టినగర్ మీదుగా శ్రీ అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుతుందన్నారు. ఈ సమావేశంలో ఆలయ ట్రస్టీలు యిమ్మందిమోహనరావు, రామకృష్ణ, చలపతి గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ఎరువుల దుకాణాల తనిఖీ

కోరుకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో పలు ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి కాకి మాధవరావు, ఏపీ గోదార జగదీష్, ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవి బుధవారం సోదాలు జరిపారు. ఈ సందర్భంగా పురుగు మందుల నాణ్యత పరిశీలించి, పరీక్షా కేంద్రాలకు శాంపిల్స్ పంపారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ వరినాట్ల సమయంలో ఎకరాకు 25 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 15 కిలోల పొటాష్ వేసినట్లయితే పైరు ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడి ఇస్తుందన్నారు.



రఘుదేవపురం సహకార సంఘంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏవో సూర్య రమేష్

యూరియా కొరతలేదు

సీతానగరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి సూర్యరమేష్ తెలిపారు. బుధవారం రఘుదేవపురం సహకార సంఘంలోని యూరియా నిల్వలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ఒకేసారి కొనుగోలు చేయవద్దని మరో నాలుగు రోజుల్లో సుమారు 400 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి వస్తున్నదని ఆయన తెలిపారు.

13 నుంచి కబడ్డీ పోటీలు

బిక్కవోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కొంకుదురులో ఈనెల 13 నుంచి 15 వరకూ సంక్రాతి సంబరాలు సందర్భంగా కొవ్వూరి బులివీర్రెడ్డి, సీతయమ్మ దంపతుల జ్ఞాపకార్థం జిల్లాస్థాయి యువతీ, యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణారెడ్డి, రామారెడ్డి బుధవారం తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాలు సాధించిన యువతీ, యువకుల జట్లకు బహుమతులు అందజేస్తామన్నారు. క్రీడాకారులు 10లోగా 9959144999, 9440333092, 7396333901లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారు కోరారు.

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకి ఘన స్వాగతం



విమానాశ్రయం వద్ద వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

కోరుకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు బుధవారం మధురపూడి విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆయనకు స్వాగతం పలికారు. గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయంలో జరుగుతున్న 2వ తెలుగు మహాసభల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. స్వాగతం పలికిన వారిలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు తదితరులు ఉన్నార

తూర్పు, పశ్చిమ డెల్టాల అభివృద్ధికి

రూ.4వేల కోట్లతో ప్రతిపాదనలు

ఎమ్మెల్యే నల్లమిల్లి



ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరిస్తున్న గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్, సుధాకరరెడ్డి

అనపర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తూర్పు పశ్చిమ డెల్టాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.4 వేల కోట్లతో ప్రదిపాదనలు సిద్ధం చేసిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. బుధవారం బలభద్రపురం గ్రామంలోని ఎమ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో డెల్టా ప్రాంత కాలువలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. గోదావరి డెల్టా ఆధునీకరించి కాలువలను, గట్టను పటిష్టం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. డెల్టా పరిధిలోని ఆఖరి ఎకరా వరకు నీరందించేందుకు కృషి చేస్తామని అన్నారు. గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. ముందుగా నూతన కమిటీలోని అధ్యక్ష ఉపాధ్యక్షులు, డీసీ చైర్మన్ల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి ఎన్.మనోజ్‌రెడ్డి, కూటమి నాయకులు ఎస్.నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులతో పాటు, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీలోని డీసీ చైర్మన్లు, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల కూటమి నాయకులు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

అనపర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామవరంలో అనపర్తికి చెందిన మసీదు ఇమామ్ ఆసిఫ్ కుమారుడి వైద్యం నిమిత్తం మంజూరైన రూ.4లక్షల చెక్కును అందజేశారు. గ్రామంలో నిర్మించే రెండు సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చింతా సురేష్ రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిద్దాం: దేశ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి అన్నారు. బుధవారం రాత్రి అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో ఆరవ రోజు కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ త్యాగరాజు రామభక్తి అనే అంశంపై ప్రవచనం చేశారు. ముందుగా షణ్ముఖ శర్మను ఆయన పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు తమలంపూడి చిన ఆదిరెడ్డి, కొవ్వూరి రఘునాధరెడ్డి, శాశ్వత చందాదారు పడాల కళ్యాణ్ రెడ్డి, కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



త్యాగరాజ ఆరాధనోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అతిథులకు సత్కారాలు... పురస్కారాలు

రాజానగరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన పలువురు అతిథులను జీజీయు కులపతి కలిదిండి సత్యనారాయణరాజు సారధ్యంలో దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడుతో పాటు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గరికపాటి నరసింహారావు, పసరపాటి బంగారయ్య శర్మ, వాగ్దేవు కె.రాజు, ఎస్.రాజాసోమశేఖర్, విశ్వనాధ గోపాలకృష్ణ శాస్త్రి, సోలమన్ డార్విన్, ఎన్.సీతారామరాజు, చలసాని శ్రీనివాస్, శిల్పి వడయార్ తదితర ప్రముఖులను దుశ్శాలువాలతో సన్మానించారు. భారతీయ తబలా ప్లేయర్ అనురాధ పాల్, కేఐఐటీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్, కెకె హెర్బల్ ఇండస్ట్రీస్ చైర్మన్ కదమ్ కెఆర్, ఆర్ఎస్ సోమరాజా చిదంబరం తదితరులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో కిమ్స్ మెడికల్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ తదితులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల్లో నేటి కార్యక్రమాలు

ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా రెండో రోజైన గురువారం జీజీయు కులపతి చైతన్యరాజు అధ్యక్షతన శ్రీరాజరాజ నరేంద్రుని వేదికపై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెలుగు భాష సాహిత్య సాంస్కృతిక ఔన్నత్య సభ జరగనుంది. దీనికి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, సినీ రచయితలు, కవులు, కళాకారులు హాజరుకానున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

రంగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద ఆశీస్సులతో రంగంపేట గ్రామ టీడీపీ, బీజేపీ, జనసేన ఎన్డీయే కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి కబడ్డీ పోటీలను బుధవారం ఆయన డ్రా తీసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి 12వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు.

శ్రీకృష్ణావతారంలో శ్రీభజేనారాయణుడు

రంగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి ఆలయంలో దశావతార ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీభజేనారాయణస్వామి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు చిలకమర్తి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.



భోగి మంటల వద్ద సందడి చేస్తున్న కంబాల శ్రీనివాసరావు తదితరులు

గోకవరంలో సంక్రాంతి సందడి

గోకవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గోకవరం-తంటికొండ రహదారి మధ్యలో గల సీఎండీ లేఅవుట్ ప్రాంగణంలో బుధవారం సంక్రాంతి సంబరాలను జరిపారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆయన పంచెకట్టులో సతీ సమేతంగా హాజరై భోగి మంటలను వెలిగించారు. అనంతరం గంగిరెద్దులకు సారెను సమర్పించడం, హరిదాసు కీర్తనలు తదితర పలు కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిపారు. సీఎండీ ప్రాంగణాన్ని చక్కటి పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఈసందర్భంగా రామసేన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మొదటి విజేత పలమశెట్టి రాజేశ్వరికి రూ.15,000, రెండవ విజేత నందూరి ఉమాదేవికి రూ.10,000, మూడవ విజేత దాసం నాగదేవికి రూ.5,000 అందించారు.



బిక్కవోలులో పదోన్నతిపై వెళ్లిన భామిరెడ్డి టీచర్‌ను సత్కరిస్తున్న ఎస్‌టీయూ నేతలు

ముప్పై శాతం ఐఆర్ ప్రకటించాలి

బిక్కవోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ మెంబర్ తమలంపూడి ఈశ్వరరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిక్కవోలు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి ఎస్‌టీయూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ డీఏలు, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐసీ లోన్లు, క్లైములు, సరండర్ లీవు మొత్తాలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం బిక్కవోలు మండలం నుంచి పదోన్నతిపై రాయవరం మండలం వెళ్లిన ఎస్‌టీయూ నేత వెలగల భామిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ నేతలు ఎన్.లక్ష్మీనారాయణ, డి.సురేంద్రరెడ్డి, జెఎస్.ప్రసాద్, వైవీవీ. సత్యనారాయణ, ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు తృతీయస్థానం

సీతానగరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి సేవ సంస్థ జూనియర్ కళాశాలల్లో గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఆళ్ల క్రాంతి తృతీయ స్థానం సాధించింది. బుధవారం సీతానగరం జూనియర్ కళాశాలలో జరిగిన సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని సీతానగరం మండల సత్యసాయి సేవాసమితి నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సెకండ్ ఇంటర్ సీఈసీ విద్యార్థిని ఆళ్ళ కాంత్రి మండల స్థాయిలో ద్వితీయస్థానం సాదించిన కె.చరణ్, తృతీయ స్థానం సాధించిన సిహెచ్ రమ్యప్రియలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 9 జనవరి 2025 | 5

అట్టహాసంగా..

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులు జరిగిన 21వ యానాం ప్రజా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. చివరిరోజు బుధవారం రాత్రి వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రత్యేక నృత్యాలు, ఫ్యాషన్ షోలతో అదరగొట్టారు.. ఆ దృశ్యాల్లో కొన్ని..







కాకినాడలో జరిగిన యూటీఎఫ్ మహాసభల్లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ నాయకత్వం

ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

కాకినాడలో నాలుగు రోజులపాటు జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారం ముగిసాయి. చివరిరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను త్వరలో చెల్లించనుందని వెల్లడించారు. కాగా యూటీఎఫ్ నూతన రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా సురేష్‌కుమార్, ప్రచురణాల కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు ఎన్నికయ్యారు.

'తెలుగు' వెలుగు

జీజీయూలో ఘనంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు



రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరంలో ఉన్న గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రారంభమైన రెండవ ప్రపంచ తెలుగు మహాసభల్లో నృత్య ప్రదర్శన

- తరలివచ్చిన ప్రముఖులు
- తెలుగులోనే పాలన సాగాలి : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వైభవంగా సాగిన తొలిరోజు పండుగ



తెలుగు మహాసభలను ప్రారంభిస్తూ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన గరికిపాటి, యార్లగడ్డ, చైతన్యరాజు, చామర్తిరాజు తదితరులు.. (కింద) వెంకయ్య ఉపన్యాసం



రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే సంకల్పంతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జీజీయూ ప్రాంగణంలో ఆదికవి నన్నయ భట్టారక, రాజరాజ నరేంద్ర, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు పేరిట మూడు ప్రధాన వేదికలను ముస్తాబు చేసి తెలుగు భాషా సాహితీ ప్రక్రియలను నిర్వహించారు. ప్రధాన వేదిక చెంతనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన అయోధ్య బాలరాముడి ఆలయ నమూనా అందరినీ అబ్బురపరుస్తోంది. ఉదయం గణపతి ఆరాధన అనంతరం జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అంతా తెలుగులోనే సాగాలి. ఇక తెలుగు మాట్లాడేవాడికే ఓటేయాలి. తెలుగు భాష రానివాళ్లను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్‌వాళ్లు రాజమహేంద్రవరం వంటి పేర్లు పలకలేక రాజమండ్రిగా మార్చారు. ఇక రాజమహేంద్రవరం అనే పిలవాలి. ఇలా చాలాపేర్లు, పదాలు మార్చేసి, మనభాషను, సంస్కృతిని చెడగొట్టారు. వాటిని మనం సరిదిద్దుకోవాలన్నారు. ఆదికవి నన్నయ్య, ఆధునిక వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వంటి వారెందరో తెలుగుభాషను సుసంపన్నం చేశారని గుర్తుచేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మహాసహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు, బృహత్ ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఆధ్యాత్మికవేత్త, శ్రీభారతీ తీర్థ పురస్కార గ్రహీత పి.బంగారయ్యశర్మ, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ప్రొఫెసర్ చామర్తి రాజు, కేటీ రామరాజు, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా సోలోమన్ డార్విన్, మాజీ ఎమ్మెల్సీ గోనె ప్రకాశరావు, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, ధూళిపాళ మహాదేవమణి, ప్రముఖ హాస్యనటుడు భద్రం, స్టార్టప్ కంపెనీ స్థాపించి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న మృత్యుంజయేశ్వర్, గోమూత్రంతో కేన్సర్, డయాబెటిస్ వంటి వాటికి మందులు తయారు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన కన్నయ్య కదంజి, న్యూక్లియర్ శాస్త్రవేత్త ఆర్.శ్యామసుందర్, సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ, వేదుల శిరీష, మధుప్రోమా, జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, జీజీయూ ప్రోఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, మాజీ ఎమ్మెల్సీ రవివర్మ తదితరులు విచ్చేశారు. ప్రముఖులు పీవీబీ సంజీవరాజు, సత్యనారాయణరాజు, కృష్ణంరాజు, సుబ్బరాజు, వీఎస్ఆర్ సోమయాజులు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



తెలుగుభాష కోసం ఉద్యమించాలి : గరికిపాటి

ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమమే ఉండాలి. డిగ్రీ వరకు తెలుగు పాఠ్యాంశం ఉండాలి. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని మహాసహస్రావధాని, పద్మశ్రీ గరికిపాటి నరసింహరావు అన్నారు. తెలుగు మహాసభల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఫోన్ చేసి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని కోరిన సందర్భంలో ఈ డిమాండ్లు చెప్పానన్నారు. ఇవి జరగనప్పుడు భాషా సంఘం ఉన్నా ప్రయోజనం లేదన్నారు.



వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న ప్రముఖులు



నన్నయతోనే తెలుగు సాహిత్య విప్లవం : యార్లగడ్డ

పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ చైతన్యరాజు నాంది పలికిన ఈ కార్యక్రమం చారిత్మాత్మకం అవుతుందన్నారు. నన్నయ మహాభారతాన్ని ఆంధ్రీకరించడంతో ఈ ప్రాంతంలో తెలుగులో సాహిత్య విప్లవం మొదలైందన్నారు. హిందీ అష్టావధానం చేసిన ఈ నగరానికి చెందిన చేబోలు శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని గతంలో తయారు చేయించానని, దానిని ప్రతిష్ఠింపజేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చైతన్యరాజుకు విజ్ఞప్తిచేశారు.



తెలుగుపై ప్రేమతోనే నిర్వహణ : చైతన్యరాజు

తెలుగుభాష పట్ల అపారమైన ప్రేమ ఉన్నందునే ప్రపంచ మహాసభలను ఇక్కడ నిర్వహిస్తున్నామని జీజీయూ కులపతి చైతన్యరాజు అన్నారు. గతేడాది జనవరిలో మూడు రోజులపాటు మహాసభలు జరిపించి, ఐదు రోజులపాటు శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జోడించిన విషయాన్ని గుర్తుచేశారు. కృత్రిమ మేథ, సాంకేతికతతో అయోధ్య రాముని నమూనా ఆలయం ఏర్పాటు చేశామన్నారు.

డిజిటల్ విధానంలోనే పన్నుల వసూళ్లు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు డిజిటల్ విధానంలోనే పన్నులు, పన్నుయేతర వసూళ్ల చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈమేరకు బుధవారం పంచాయతీలకు ఉత్తర్వులు జారీచేశారు. తూర్పుగోదావరి జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలు ఇంటి పన్ను, నీటిపన్ను డిజిటల్ విధానంలో యూపీఐక్యూఆర్‌కొ, పాయింట్ ఆన్ సేల్(పీఓఎస్) మెషీన్ల ద్వారా వసూలు చేయాలన్నారు. ఇక నుంచి ప్రతీఒక్క పన్ను, పన్నుయేతర వసూళ్లను అన్ని గ్రామ పంచాయతీలు డిజిటల్ విధానంలోనే చేపట్టాల్సి ఉందన్నారు. ఇప్పటికే డిజిటల్ నగదు చెల్లింపు వసూళ్లపరంగా తగినంత అవగాహన ఉందని, ఇక నుంచి అన్ని పంచాయతీల కార్యదర్శులు అన్ని రకాల లావాదేవీలను పారదర్శకతతో వ్యవహరించి నిర్వహించాలని కలెక్టర్ స్పష్టంచేశారు. భవనాలు, భూముల పన్నులు, క్రమబద్ధీకరణ(బీఎల్ఆర్) రుసుం, పిష్‌ట్యాంక్ లీజు రుసుములతోపాటు ఇతర అన్ని రకాల పన్నులు డిజిటల్ విధానంలో మాత్రమే చేయాలని, ఇది నూరుశాతం జరగాలన్నారు. ఈ ఉత్తర్వులు అతిక్రమించిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో తక్షణమే అమలులోకి వస్తాయని ఇన్‌చార్జి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.నాగలత తెలిపారు.



జేసీ చిన్నరాముడుతో కలసి సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

అలినేషన్ అనుమతుల కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతికి ఆయా శాఖల ఉన్నతాధికారుల ద్వారా భూముల పరాయికరణ (ల్యాండ్ అలినేషన్)కు సంబంధించి అనుమతుల మంజూరుకోసం ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల పరాయీకరణ భూములు పీవీజీటీ గ్రూప్స్, భూపతిపాలెం, పీఎం జన్మన్ గృహాలు వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ, ఏపీట్రాన్స్‌కో, ఎయిర్ పోర్టు, టూరిజం, క్రీడలు, జాతీయ రహదారులు, మార్కెటింగ్, పశుసంవర్ధక, విద్య, ఆరోగ్య తదితర శాఖలకు చెందిన 54 భూ సంబంధ అలినేషన్ ప్రక్రియపై శాఖాధికారులు దృష్టికి తీసుకుని వెళ్లడం, తగిన అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఆయా భూముల పరాయీకరణకి ఆర్డీవోలు జారీచేయాల్సిన అనుమతులు, మార్గదర్శకాలను అనుసరించి మంజూరుచేయాలని స్పష్టంచేశారు. జిల్లాలో ముఖ్యంగా బలహీన గిరిజన సమూహాలకు చెందిన 99 కుటుంబాలకు చెందిన 399 మందికి తగిన గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే ఈ విషయమై విచారణ చేపట్టామని, నివేదికల ఆధారంగా వారికి ప్రభుత్వపరంగా చేయూత ఇవ్వడంపై దృష్టిపెట్టాలని ఆర్డీవోలు, హౌసింగ్, రెవెన్యూ, ఐసీడీఎస్, డీఈవో, డీఆర్‌డీఏ, బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణిసుస్మిత, జిల్లాలో ఇతర శాఖల ఉన్నతాధికారులు డి.భాస్కర్‌రెడ్డి, కేఎన్ జ్యోతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

హిట్ అండ్ రన్ కేసుల్లో సుప్రీం ఆదేశాలు అనుసరించాలి

మోటారు వాహనాల ప్రమాదాలపై డీఎల్ఎస్ఏ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. మోటారు వాహనాల చట్టం 1988, హిట్ అండ్ రన్ మోటారు యాక్సిడెంట్ స్కీమ్ -2022 నిబంధనలను అనుసరిస్తూ బాధితులకు పరిహారం అందించేందుకు కమిటీలోని ప్రతి ఒక్కరూ సహకారాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆర్డీవోలు, ఆర్డీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్ నియంత్రణ, పర్యవేక్షణకు కమిటీ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆందోళన కల్గిస్తున్న హెచ్‌ఎంపీవీ వైరస్ నియంత్రణ, పర్యవేక్షణకు రాజమహేంద్రవరం జీటీజీహెచ్ (ప్రభుత్వ బోధనా సర్వజనాసుపత్రి)లో ఏడుగురు వైద్యులతో కూడిన కమిటీని నియమిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఆసుపత్రిలోని అందరు హెచ్‌వోడీలు, వైద్యులు, నర్సింగ్‌స్టాఫ్‌కు సర్క్యులర్‌ను జారీచేశారు. ఈ కమిటీకి జనరల్ మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా పీడియాట్రిక్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ సీఎస్ మోహనచంద్ర, మైక్రోబయాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఎం.భారతి, అనస్థీషియా విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్, పల్మనాలజీ విభాగం హెచ్‌వోడీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కిరణ్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పి.శ్రీనివాస్ ఉంటారు. క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటారు.







ప్రమాదంలో కారులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు.. తీవ్రంగా గాయపడిన సారిసిల్లి సాయి

టిప్పర్‌ని, చెట్టుని ఢీకొట్టిన కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు

అనపర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని వివేకానంద సెంటర్‌లో బుధవారం రాత్రి పది గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. దుప్పలపూడి నుంచి అనపర్తి వైపు వస్తున్న కారు దుప్పలపూడి వైపు వస్తున్న టిప్పర్ లారీని ఢీకొట్టింది. దీంతో కారు సుమారు 20 అడుగుల మేర వెనక్కు వెళ్లి చెట్టును ఢీకొట్టి నిలిచింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు కావడంతో కారు డ్రైవింగ్ చేస్తున్న సబ్బెళ్ళ ప్రకాష్‌రెడ్డి సీటులోనే ఇరుక్కుపోయి ఆర్తనాదాలు చేయసాగాడు. దీంతో స్థానికులు సహాయ చర్యలు చేపట్టి వెనుక సీటులో ఉన్న కొవ్వూరి మంగిరెడ్డి, పారిసిల్లి సాయిలను బయటకు తీసి ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కారులో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీసేందుకు సుమారు అరగంటపాటు కష్టపడాల్సి వచ్చింది. చివరకు గునపంతో కారు డోరును తప్పించి ప్రకాష్‌రెడ్డిని బయటకు తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కావడంతో వారికి అనపర్తి ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స జరిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక కాంట్రాక్టరు వద్ద ప్రకాష్‌రెడ్డి పనిచేస్తున్నాడు. బుధవారం మండపేట ఆసుపత్రి పని ఉందని యజమానిని కారు అడిగి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి పది గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తీరును చూస్తుంటే ఓవర్ స్పీడు కారణంగా కనిపిస్తోందన్నారు. తొలుత క్షతగాత్రులకు స్థానికంగా ప్రథమ చికిత్స చేసి అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

డ్రైనేజీపై ఆక్రమణల తొలగింపుపై
మున్సిపల్ ఆర్డీ విచారణ



కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో వ్యాపారస్తులను విచారిస్తున్న మున్సిపల్ ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు

కొవ్వూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో డ్రైనేజీపై ఆక్రమణలు తొలగింపుపై తలెత్తిన వివాదంపై మున్సిపల్ ఆర్డీ విచారణ చేపట్టారు. కొవ్వూరు పట్టణంలోని విజయవిహార్ సెంటర్‌లో హోటల్ నిర్వాహకులు వ్యర్థాలను డ్రైనేజీలోకి వదిలి వేయడంతో డ్రైనేజీ నుంచి తీవ్ర దుర్గంధం వస్తోందని స్థానికులు పీజీఆర్ఎస్‌లో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదును పురస్కరించుకుని మున్సిపల్ అధికారులు ఫైర్ ఇంజన్ సహాయంతో పారిశుధ్య పనులు చేపట్టగా ఫలితం లేకపోవడంతో, హోటల్ భవనంవద్ద పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రైనేజీపై పూర్తిగా కప్పివేసి నిర్మించిన ఆక్రమణలు తప్పనిసరి పరిస్థితులలో తొలగించారు. ఈ నేపథ్యంలో భవన యజమాని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం విచారణ చేపట్టారు. మున్సిపల్ అధికారులు, భవన యజమాని, మెయిన్‌రోడ్‌లోని ఇతర వ్యాపారస్తుల నుంచి వివరాలు సేకరించి, స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికీ డ్రైనేజీ నుంచి దుర్గంధం వస్తుండడంతో చర్యలు తీసుకోవాలని కమీషనర్ నాగేంద్రకుమార్‌ను ఆదేశించారు. అదేవిధంగా సమీపంలోని మరో రెండు బిర్యాని సెంటరు నిర్వాహకులు వ్యర్థాలను నేరుగా డ్రైనేజీలోకి వదిలి వేస్తున్నారని, డ్రైనేజీలలో వ్యర్థాలు వదిలి వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.సాయిబాబు, టీపీవో టి.మణిరామ్, ఏఈలు కె.సుమంత్, జి. సందీప్, ఆర్డీ కార్యాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు

చెరువు గట్టుపై ఆక్రమణల తొలగింపు

● మహిళల ఆందోళన

కొవ్వూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిడిపి చెల్లాయమ్మ చెరువుగట్టుపై కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో చెల్లాయమ్మ చెరువును రజక సంఘం నాయకులు లీజుకు తీసుకున్నారు. ఆ చెరువు గట్టుపై గౌడ సంఘం నాయకులు సర్ధార్ పాపన్నగౌడ్, అమ్మవారి విగ్రహాలతోపాటు, పాకలు, గడ్డిమేట్లు వేసి ఆక్రమణలు చేపట్టారని, ఆక్రమణలు తొలగించాలని చెరువు లీజుదారులు రజక సంఘం నాయకులు 2023లో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆక్రమణలు తొలగించాలని 2024 నవంబరులో ఉత్తర్వులు ఇచ్చింది. బుధవారం కోర్టు ఉత్తర్వులు అమలు చేయడానికి రెవెన్యూ, పోలీసుల సహకారంతో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆక్రమణలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. సర్ధార్ పాపన్నగౌడ్ విగ్రహం, అమ్మవారి విగ్రహాలు తొలగిస్తుండగా గౌడ కులస్తులు, మహిళలు ఆందోళన చేపట్టారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా గడ్డిమేట్లు పాకలు తొలగించారు. మిగిలినవి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, సర్వేయర్ ఎ.ప్రసాద్, వీఆర్వో పి.వి.వి.సుబ్రహ్మణ్యం, సిబ్బందిపాల్గొన్నారు.



చిడిపి గ్రామంలో చెర్వుపై ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



ఆందోళన చేస్తున్న మహిళలు

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాగల్లు, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణగూడెం, దారవరం గ్రామాల విద్యుత్ ఫీడర్లు మరమ్మతుల కారణంగా గురువారం, శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఏపీఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె. జగన్మోహనరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని 1వ వార్డు రాజీవ్‌కాలనీకి చెందిన గేదెల శ్రీను తరచూ ఇంట్లోంచి బయటకు వెళ్లి కొన్ని రోజుల తరువాత తిరిగి వచ్చేవాడు. అదేవిధంగా 2016లో ఇంట్లోంచి వెళ్లిన శ్రీను తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల వెతికారు ఆచూకీ లభించక పోవడంతో భార్య గేదెల జ్యోతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ వైర్లు దొంగతనంపై కేసు నమోదు

కొవ్వూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు బీఎస్ఎన్ఎల్ వైర్లు కట్‌చేసి దొంగిలించుకుపోయినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణంలోని పాత ఆర్డీవో కార్యాలయంవద్ద 23వ స్తంభంపై ఉన్న 20 మీటర్ల బిఎస్ఎన్ఎల్ వైర్లు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయినట్లు ఈనెల 4న అధికారులు గుర్తించారు. దీనిపై బిఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీరు కొల్లి శివప్రసాద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కొవ్వూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి గాయపడినట్లు కొవ్వూరు రూరల్ హెచ్‌సీ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు. సీతానగరం గ్రామానికి చెందిన చిడిపి బుచ్చయ్య బైక్‌పై చిట్యాల బయలుదేరాడు. కొవ్వూరు మండలం కాపవరం ఫ్లైఓవర్ దిగుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బుచ్చయ్యకు కౌకుదెబ్బలు తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుచ్చయ్య కుమారుడు చిడిపి రమేష్ అందించిన ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి



కవులూరులో మృతి చెందిన సుబ్బారావు

నల్లజర్ల, జనవరి8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం కవులూరులో బుధవారం ఫిట్స్ వచ్చి గుంటూరుజిల్లా మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కట్టపోగు సుబ్బారావు(57)మృతి చెందాడు. సుబ్బారావు గుంటూరు నుంచి నల్లజర్ల వచ్చి నల్లజర్లలో ఆటో ఎక్కి పోతవరం వెళుతుండగా ఫిట్స్ రావడంతో కవులూరులో ఆటోలో నుంచి కింద పడి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మురళీకొండపై ఒక ఇంట్లో నిల్వచేసిన 3200 కేజీల పీడీఎస్ బియ్యంను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే ధవళేశ్వరానికి చెందిన సప్తగిరి, గణేష్ ఇద్దరు కలిసి పీడీఎస్ బియ్యాన్ని మురళీకొండపై దాచిపుంచినట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంలో వారు దాడి చేసి పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్‌చేసి ఇద్దరినీ బొమ్మూరు పోలీసులకు అప్పగించారు. ఈమేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ బ్యాగులోంచి బంగారం అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ బయట బస్సు ఎక్కుతున్న ఒక మహిళ బ్యాగులోంచి గుర్తుతెలియని దొంగలు 108 గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. టూటౌన్ పోలీసులు కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే .. డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన శ్రీరామ రేవతి అనే మహిళ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈనేపథ్యంలో తన స్వగ్రామం వెళ్లేందుకు మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి రైలులో బయలు దేరి బుధవారం రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. బయటకు వచ్చి రామచంద్రపురం ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నక్రమంలో గుర్తుతెలియని దొంగలు ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని 108 గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. బ్యాగును లాగినట్లుగా అనిపించడంలో వెంటనే ఆమె గుర్తించిన ఎవ్వరనేది తెలియలేదు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడీబీ రహదారి పనులపై సమగ్ర వివరాలు ఇవ్వండి

● సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



ఏడీబీ రహదారి పనులపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) నిధులతో చేపట్టిన రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేసే క్రమంలో వాటికి సంబంధించి ప్రభుత్వప్రైవేట్‌పరంగా సేకరణ ప్రక్రియపై సమగ్ర వివరాలు తనకు అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీవో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ అధికారులతో ఏడీబీ రోడ్డు పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ-రాజానగరం వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ క్రమంలో రహదారి నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. జిల్లాకు చెందిన ప్రాజెక్ట్ అధికారిగా జాయింట్ కలెక్టర్, భూసేకరణ అధికారిగా రాజమండ్రి ఆర్డీవో, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా రాష్ట్ర హైవే అధికారులు బాధ్యత వహించాల్సిఉంటుందన్నారు. రహదారి విస్తరణ కోసం మొత్తం 72.16 ఎకరాల భూమి సేకరణ చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇందులో 57.69 ఎకరాలు ప్రైవేట్ భూమి సేకరించగా తూర్పుగోదావరిజిల్లాలో 34.11 ఎకరాల భూమి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీకి అప్పగించామన్నారు. మిగిలిన వాటికి జిల్లా పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి ఎంత, అందులో ఆక్రమిత భూములు, నిర్మాణాలు వంటి సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఆయా ఆక్రమణలకు పాల్పడిన వారిని ఖాళీ చేయించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఈఈ శ్రీకాంత్, డీఈ రాజానగరం, రంగంపేట తహసీల్దార్ లావణ్య, కే అనసూయ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డు పనులను పరిశీలించిన కలెక్టర్, జేసీ

రంగంపేట: బుధవారం సాయంత్రం రాజానగరం, రంగంపేట మండలాల పరిధిలో ఏడీబీ రోడ్ రహదారి పనులను, భూసేకరణ విషయంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ - తూర్పుగోదావరిజిల్లాకు చెందిన ప్రధానమైన రహదారి మార్గంను సాధ్యమైనంత త్వరగాపూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. ప్రభుత్వ భూములలో ఆక్రమణలకు గురి అయిన వాటిని గుర్తించి అక్కడి నుంచి వారిని తరలించి, ఆయా నిర్మాణాలను తొలగించే విషయంలో హేతుబద్ధతగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎస్టీరాజాపురం, వడిశలేరు గ్రామాలకు చెందిన భూములను పరిశీలించారు.

నష్టపరిహారం మాకు ఇవ్వండి

రంగంపేట సెంటర్‌లో ఉన్న షాపుల యజమానులతో మాట్లాడారు. షాపులను స్వచ్ఛందంగా ఖాళీచేయాలని జేసీ చిన్నరాముడు చెప్పగా రోడ్డు విస్తరణలో భాగంగా మా ఇల్లు, షాపులు పోతున్నందున ఇంతవరకు మాకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని, ఇల్లు కోల్పోతున్నవారికి వేరేచోట ఇళ్లస్థలాలు ఇస్తామన్నారు. ప్రభుత్వమే మమ్ములను ఆదుకోవాలని వాపోయారు. దానికి స్పందించిన జేసీ త్వరలో భూమి కోల్పోతున్న రైతులకు, షాపుల యజమానులకు సమావేశం ఏర్పాటుచేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

దొమ్మేరు పీహెచ్‌సీకి సామగ్రి అందజేత



దొమ్మేరు పీహెచ్‌సీకి ఎవేర్ సంస్థ పంపిణీ చేసిన ఆసుపత్రి సామగ్రి

కొవ్వూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు పీహెచ్‌సీకి ఎస్‌బీఐ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఎవేర్ సంస్థ గవర్నమెంటు ఆసుపత్రికి ఉపయోగపడే అత్యాధునిక ఆసుపత్రి సామాగ్రిని అందజేశారు. బుధవారం దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ఎస్.ధర్మరాజుకు ఎవేర్ సంస్థ చైర్మన్ మాధవన్, ప్రాజెక్టు డైరెక్టర్ పి.వరుణ్, ఎస్‌బీఐ సిబ్బంది ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన స్ట్రేచ్చర్, వీల్‌ఛైర్, ఇంజక్షన్ ట్రాలీ, ఒటి టేబుల్, వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. డా.ధర్మరాజు మాట్లాడుతూ ఎస్‌బీఐ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఎవేర్ సంస్థ అందించిన గవర్నమెంటు ఆసుపత్రికి ఉపయోగపడే అత్యాధునిక సామాగ్రితో రోగులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పి స్తామన్నారు. ఎస్‌బీఐ, ఎవేర్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో వేగేశ్వరపురం విద్యార్థులకు ప్రథమ బహుమతి



బహుమతి ప్రధానం చేస్తున్న జిల్లా విద్యాధికారి వాసుదేవ్

తాళ్లపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి సాధించిన వాయిస్ వీల్‌చైర్ ప్రాజెక్టును తయారు చేసిన సైన్సు ఉపాధ్యాయిని, విద్యార్థులను జిల్లా విద్యాధికారి వాసుదేవ్ బహుమతి ప్రదానం చేశారు. మండలంలోని వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలోని అటల్ టిస్కల్ లాబ్ ఇన్‌చార్జి గుడివాడ దుర్గా భవాని ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులు సాయి మణికంఠ, సాయి చరణ్‌లు తయారుచేసిన వాయిస్ కంట్రోల్ వీల్‌చైర్‌కు మండలస్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించారు. శ్రీ సత్యసాయి గురుకులంలో జరిగిన జిల్లా స్థాయిలో జరిగిన కార్య క్రమంలో పాల్గొన్న విద్యార్థులను జిల్లా విద్యా శాఖాధికారి వాసుదేవ్ మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను, ఉపాధ్యా యులను అభినందించి బహుమతిని అందించారు. మండల విద్యాశాఖాధికారులు బాలా మణి, నెహ్రూజీలు విద్యార్థులకు అభి నందనలు తెలిపారు.

దూబచర్ల డైట్ కళాశాలలో రంగోత్సవ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ కమల కుమారి

నల్లజర్ల, జనవరి8 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల డైట్ కళాశాలలో రంగోత్సవ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కమలకుమారి పేర్కొన్నారు. బుధవారం జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. రంగోత్సవ పోటీలతో పాటు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగోత్సవ్ విశిష్టతను ప్రిన్సిపాల్ కమలకమారి విద్యార్థులకు తెలియజేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

అతిధులకు సత్కారాలు... పురస్కారాలు.

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన పలువురు అతిధులను జీజీయు కులపతి కలిదిండి సత్యనారాయణరాజు సారధ్యంలో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుతో పాటుగా యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, గరికపాటి నరసింహారావు, పసర్లపాటి బంగారయ్యశర్మ, వాడ్రేవు కె.రాజు, ఎస్.రాజాసోమశేఖర్, విశ్వనాధగోపాల కృష్ణశాస్త్రి, సోలమన్ డార్విన్, నడింపల్లి సీతారామరాజు, చలసాని శ్రీనివాస్, శిల్పి వడయార్ తదితర ప్రముఖులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. భారతీయ తబలా ప్లేయర్ అనురాధపాల్, కేవిఐటీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్, కెకెహెర్బల్ ఇండస్ట్రీస్ చైర్మన్ కదమ్ కెఆర్, ఆర్ఎస్ సోమరాజా చిదంబరం తదితరులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కిమ్స్ మెడికల్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ పాల్గొన్నారు.

తెలుగు మహాసభల్లో నేటి కార్యక్రమాలు

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా రెండోరోజైన గురువారం జీజీయు కులపతి చైతన్య రాజు అధ్యక్షతన శ్రీరాజరాజ నరేంద్రుని వేదికపై ఉదయం 9గంటల నుంచి 10గంటలవరకు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించనున్నాయి. 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెలుగు భాషసాహిత్య సాంస్కృతిక ఔన్నత్యసభ జరుగనుంది. ఈకార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో పాటుగా రాజకీయ ప్రముఖులు, సినీ రచయితలు, కవులు హాజరుకానున్నారు.

కరికచర్లగూడెంలో పింఛన్లపై విచారణ

గోపాలపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా డీఎంఅండ్ హెచ్‌వో సిఫార్సు లేఖలతో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్‌లు అందుకుంటున్న కదలలేని స్థితిలో ఉంటూ పింఛన్లు అందుకుంటున్న 66మందిని బుధవారం బృందాలు విచారణ చేపట్టాయి. మండలంలో డీఎంఅండ్‌హెచ్‌వో సిఫార్సు లేఖలతో 66మంది పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించిన అధికారులు ఆదేశానుసారం 3బృందాలు విచారణ చేపట్టాయి. ఒక్కో బృందంలో ఇద్దరు డాక్టర్లు, ఒక డిజిటల్ అసిస్టెంట్‌తోపాటు స్థానికవైద్యులు ఈ బృందంలో ఉన్నట్లు సమాచారం.

రేపటి నుంచి జిల్లాస్థాయిలో షటిల్ టోర్నమెంట్

తాళ్లపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాళ్లపూడి నక్కా చిట్టిబాబు ఇండోర్ స్టేడియంలో ఈనెల 10వ తేదీ నుంచి అండర్ 10, 13, 15 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులకు, మెన్ సిగిల్స్, డబుల్స్ షటిల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తాళ్లపూడి బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నీలి శ్రీనివాస్, అధ్యక్షుడు నక్కా ఆనంద కుమార్‌లు తెలిపారు. ఈపోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆటగాళ్లు విచ్చేస్తున్నారని జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ నాగులకొండ వీరభద్రరావు అన్నారు. పోటీలలో పాల్గొనేవారు 10వ తేదీ సాయంత్ర 5 గంటలలోపు వారి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఉండ్రాజవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో వీఎస్ రామారావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలకు విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు, హాస్టల్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిని వినియోగించుకునేలా గ్రామస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవోపీఆర్డీ కెఎస్ఆర్ శర్మ మాట్లాడుతూ బాలికలను చిన్నతనం నుంచే అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేలా కృషి చేయాలని సూచించారు. వివిధ అంశాలపై ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శ్రీలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో సక్సేనరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులతడకగా కులగణన జాబితా

గోపాలపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కులగణన పేరుతో వలంటీర్లు చేసిన నిర్వాకం ఇప్పుడు తప్పుల తడకగా ఉన్న జాబితా సచివాలయాల్లో బయటపడ్డాయి. కరిచర్లగూడెంలో సుమారు 95మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిని 96మందిని మాల సామాజిక వర్గంనకు చెందిన వారిగా నమోదు చేశారు. ఒక్క కరిచర్లగూడెం గ్రామంలోనే 96మందిని తప్పుగా నమోదు చేశారు. మిగిలిన మండలంలోని 18పంచాయతీల్లో 32గ్రామాల్లో మరిన్ని తప్పుగా నమోదు చేసిన జాబితాలో బయటపడే అవకాశం ఉంది.

ఐఐటీ విద్యార్థి శ్రీజాకు సాయం అందజేత



ఐఐటీ విద్యార్థి కౌలూరి శ్రీజాకు రూ.55వేలు ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

గోపాలపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంధత్వం అనేది మనిషికే కానీ మనసుకు కాదని దొండపూడి సేయింట్ మేరిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ మార్గరేట్ అన్నారు. ఉపాధ్యాయ బృందంతోపాటు విద్యార్థుల నుంచి సేకరించి రూ.లక్షా 42వేల రూపాయల నగదును స్నేహబ్లైండ్ పీపుల్ ట్రస్ట్‌కు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ రెజీన, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వేలచింతలగూడెం గ్రామానికి చెందిన ఐఐటీ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కౌలూరి శ్రీజాకు వాదాలకుంట గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి సతీష్ దంపతులు తండ్రి మల్లిపూడి శామ్యూల్ జ్ఞాపకార్థం రూ.50వేలు విలువ చేసే ల్యాప్‌ట్యాప్‌ను, అదేవిధంగా చారవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మానవత ఉపాధ్యక్షుడు రాపాక ఫణికిషోర్ రూ.5వేలు నగదును బహూకరించినట్లు మావనత సంస్థ చైర్మన్ జొన్నల గడ్డ రాంబాబు తెలిపారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనా రాయణ, మాజీ జడ్పీటీసీ ఉండవల్లి బోస్ ల్యాప్‌ట్యాప్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో మానవత ఉపాధ్యాక్షుడు రాపాక ఫణికిషోర్, సంస్థ ఉపాధ్యక్షులు, కోశాధికా గడా జోగేంద్రప్రసాద్, మానవత మాజీ అధ్యక్షత గుబ్బా లక్ష్మణరావు, ముప్పన వరప్రసాదరెడ్డి, సభ్యులు కాకర్ల శ్రీరామ్, ప్రసాద్, కాట్రు బ్రహ్మానందం, సీఆర్‌పీ కొయ్య నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గండి చెరువు వద్ద చెత్త తొలగించాలని ఆందోళన



గండి చెరువు వద్ద చెత్త తొలగించాలని ఆందోళన చేస్తున్న రైతులు

దేవరపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ చెత్తాచెదారాలను ఊరి శివారులో ఉన్న గండిచెరువు వద్ద డంపింగ్ చేయడం వలన రైతుల కు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆచంట శేషారావు, బళ్ళా కృష్ణదర్మా రావు, పుట్టా రామారావులు అన్నారు. యర్నగూడెం గ్రామానికి చెందిన రైతులు గండిచెరువు వద్ద పంచాయతీ చెత్త డంపింగ్ చేయడం వలన కింద ఆయకట్టు పొలాలకు వెళ్లే తూరలు పూడుకుపోతున్నాయని రైతులు ఆందోళ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ చెరువు 202 ఎకరాల్లో విస్తరించి ఉందని ఈ నీటి ద్వారా 90ఎకరాలు సాగు జరుగుతుందని పంచాయతీకి చెందిన సిబ్బంది గ్రామంలోని చెత్త అంతా ట్రాక్టర్లపై గండిచెరువు రహదారి పక్కన వేయడం వలన చెరువులో నుంచి వచ్చే తూరలు పూడుకుపోవడంతోపాటు కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయని దీంతో పంటపొలాలు నాశనం అవుతున్నాయని, కుక్కలు వాహనచోదకులపై దాడి చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. దీనిపై చెత్త వేయకుండా చూడాలని సర్పంచ్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా సర్పంచ్ సమస్యలు పరిష్కరించకపోగా వారిపై దురుసుగా మాట్లాడారని రైతు ఆచంట శేషారావు తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రైతులు కారుమంచి వెంకటేశ్వరరావు, గద్దే శ్రీనివాస్, భాస్కర్, గిరి,పెద్దిలియ, పాల్గొన్నారు.

తిరుగులేని నేత నారా లోకేశ్: జవహర్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): యువనేత నారా లోకేశ్ తన రాజకీయ ప్రస్థానంలో తిరుగులేని నాయకుడిగా ఎదగటం గర్వంగా ఉందని మాజీ మంత్రి జవహర్ పేర్కొన్నారు. యువగళం పాద యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసిన లోకేశ్.. అధికారంలోకి వచ్చాక ప్రజాదర్బార్ నిర్వహిస్తూ, ప్రజల కన్నీళ్లు తుడుస్తున్నారని కొనియాడారు. విదేశాల్లో చిక్కుకున్న తెలుగు వారికి ఆపన్నహస్తం అందిస్తూ, పిలిస్తే పలికే ప్రజానాయకుడిగా అనతికాలంలోనే పేరు తెచ్చుకున్నారని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.